ప్రజారోగ్యానికి జిమ్‌దాబాద్





జీవీఎంసీ 10వ వార్డు వివేకానందనగర్‌లో ఓపెన్ జిమ్‌లో పిల్లల సందడి

పార్కులు, గ్రీన్ బెల్ట్‌ల అభివృద్ధి

వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుతో విశేష ఆదరణ

ఒకప్పుడు చెత్తా చెదారం.. శిథిలమైన ఫెన్సింగ్, ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా ఉండే గ్రీన్ బెల్ట్‌లు, ఖాళీ స్థలాల రూపురేఖలు ప్రస్తుత ప్రభుత్వం చొరవతో మారిపోయాయి. ఆరోగ్యం, ఆహ్లాదం రెండూ ఒకే చోట దొరికేలా తీర్చిదిద్దారు. నగరంలో రహదారులకు ఆనుకుని మణిహారంగా ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాలను హెల్తీ పార్కులుగా ఆధునికీకరించారు. కాసేపు సేద తీరడానికి అనువుగా బెంచీలు, వ్యాయామం కోసం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటుతో గ్రీన్ బెల్ట్‌లు విశేష ఆదరణకు నోచుకున్నాయి.

– ఆరిలోవ

కోవిడ్ తర్వాత ప్రజల జీవనశైలిలో మార్పు అనివార్యమైంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు శ్రద్ధ చూపుతున్నారు. రోజువారీ దినచర్యలో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కొద్దిసేపైనా వ్యాయామానికి సమయం కేటాయిస్తున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు నివాసాలకు సమీపంలో ఉన్న పార్కులకు వస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే పార్కులకు వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత మహర్దశ పట్టింది. ఈ క్రమంలో కాలనీలకు సమీపంలోనే ఓపెన్ జిమ్‌లు అందుబాటులోకి వచ్చాయి.



జీవీఎంసీ 13వ వార్డు స్కిల్ డెవలప్‌మెంట్ వద్ద ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న యువకులు, వృద్ధులు

ఇవే ఓపెన్ జిమ్‌లు

నియోజకవర్గం జీవీఎంసీ జోన్–2లో 5 వార్డులు(9 నుంచి 13 వరకు), జోన్–3లో 10 వార్డులు(15 నుంచి 23 వరకు, 28వ వార్డు) ఉన్నాయి. వాటిలో జోన–2 పరిధిలో ఉన్న వార్డుల్లో 7, జోన్–3 పరిధిలో ఉన్న వార్డుల్లో 11 ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. జోన్–2 పరిధిలో తొమ్మిదో వార్డులో సంజీవినగర్, సంజయ్‌గాంధీ కాలనీ, పదో వార్డులో వివేకానందనగర్ పార్కు, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణం, 12వ వార్డులో పెదగదిలి, 13వ వార్డులో ముడసర్లోవ ప్రాంతం స్కిల్ డెవెలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ పక్కన, ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్, 16వ వార్డులో విద్యానగర్, సీఎంఆర్ సెంట్రల్ వద్ద గ్రీన్ జోన్, 17వ వార్డులో ఎంవీపీ కాలనీ సెక్టార్–1 పార్కు, సెక్టార్–8 పార్కు, 19వ వార్డులో సెక్టార్–12 పార్కు, 20వ వార్డులో లాసన్స్‌బే బాల భవన్, పెదవాల్తేరు రామరాజునగర్ పార్కు, కేడీపీఎం స్కూల్, 21వ వార్డులో ఆర్కే బీచ్ వద్ద, 22వ వార్డులో పిఠాపురం కాలనీ, 28వ వార్డు రామ్‌నగర్‌లో జిమ్‌లు అందుబాటులో ఉన్నాయి.



జీవీఎంసీ 16వ వార్డు సీఎంఆర్ సెంట్రల్ వద్ద..

రూ.90 లక్షలతో 18 ఓపెన్ జిమ్‌లు

జీవీఎంసీ అధికారులు అవసరమైన చోట్ల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రతి ఓపెన్ జిమ్‌కు రూ.5 లక్షల నిధులు ఖర్చుచేసి వివిధ రకాల వ్యాయామ పరికరాలు సమకూర్చారు. నియోజకవర్గంలో 18 చోట్ల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. వాటి కోసం జీవీఎంసీ అధికారులు ప్లాట్‌ఫారం నిర్మించి పరికరాలు ఏర్పాటు చేశారు. వాటిన్నింటికీ రూ.90 లక్షలు ఖర్చు చేశారు.

ఆహ్లాదకర వాతావరణంలో వ్యాయామం



ఓపెన్ జిమ్‌లో అవసరమైన వ్యాయామ పరికరాలు ఉన్నాయి. సంవత్సరం నుంచి రోజూ స్కిల్ డెవెలప్‌మెంట్ వద్ద ఉన్న జిమ్‌లో వ్యాయామం చేస్తున్నాను. బయట ప్రైవేట్ జిమ్‌లకు వెళ్తే నెలకు పెద్ద మొత్తంలో ఫీజు చెల్లించాల్సి వస్తుంది. ఇక్కడ ఉచితంగా పరికరాలను ఉపయోగించుకుంటున్నాం. ఆహ్లాదకర వాతావరణంలో వ్యాయామం చేయడం చాలా బాగుంది.

– ఎస్.కె.బాషా, ఆరిలోవ

ఉపయోగకరంగా ఓపెన్ జిమ్‌లు



జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ముడసర్లోవ వద్ద ఉదయం, సాయంత్రం నడక కోసం వచ్చేవారు తప్పనిసరిగా ఇక్కడ వ్యాయామం చేస్తున్నారు. వృద్ధులు, యువకులు ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. సెలవు రోజుల్లో పిల్లలు ఎక్కువ మంది ఈ పరికరాల వద్ద సందడి చేస్తున్నారు. వీటిని ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి, జీవీఎంసీ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– మూర్తి, ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆరిలోవ

క్లుప్తంగా

పేద మహిళలకు చీరల పంపిణీ



వివేకానందనగర్‌లో మహిళలకు చీరలు అందిస్తున్న కె.ఆర్.పాత్రుడు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు వివేకానందనగర్‌లో అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఆర్.పాత్రుడు ఆధ్వర్యంలో మంగళవారం జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన స్థానిక పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎండాడలో అంధ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొటాన రాము, స్థానిక మహిళలు కొండమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యానిమల్ కీపర్ కుటుంబానికి న్యాయం చేయాలి

ఆరిలోవ: జూ పార్కులో ఎలుగుబంటి దాడిలో మృతి చెందిన యానిమల్ కీపర్ నగేష్‌బాబు కుటుంబానికి తగిన న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జునకు మంగళవారం జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ తదితరులు వినతి పత్రాలు అందజేశారు. మృతుడి కుటుంబానికి నష్టపరిహారంగా రూ.50 లక్షలు, ఉద్యోగం ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. ఎలుగుబంటి దాడి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు.

మధురం.. కర్ణాటక వాయిద్య కచేరీ



కచేరీ చేస్తున్న వాయిద్య కళాకారులు

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ 54వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం చెన్నైకి చెందిన కర్ణాటక వాయిద్య కచేరీ సుమధురంగా సాగింది. ఈ కచేరీలో మాండోలిన్‌పై రాజేష్, వయోలిన్‌పై వి.వి.శ్రీనివాసరావు, మృదంగంపై డాక్టర్ సతీష్‌కుమార్, ఘటంపై ఎస్.కార్తీక్ సహకారం అందించి సంగీత ప్రియులను ఓలలాడించారు.

క్రమశిక్షణ, లక్ష్య నిర్దేశంతోనే విజయం



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న విభాగాధిపతి జర్రా అప్పారావు

ఏయూ క్యాంపస్: క్రమశిక్షణతో కూడిన జీవనం, లక్ష్యనిర్దేశం చేసుకుని కష్టించి పనిచేసే తత్వం విద్యార్థులు కలిగి ఉండాలని, అప్పుడే విజయం సాధ్యమవుతుందని ఏయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అన్నారు. మంగళవారం విభాగంలో నిర్వహించిన ప్రథమ సంవత్సరం విద్యార్థుల స్వాగత వేడుకల్లో ఆయన మాట్లాడారు. కొత్తగా వర్సిటీకి వచ్చిన జూనియర్ విద్యార్థులను స్వాగతించడం మన సంప్రదాయమన్నారు. విశ్రాంత ఆచార్యులు జి.యోహాన్‌బాబు మాట్లాడుతూ విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వి.సిమ్మన్న, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ బి.వెంకటస్వామి, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సామాజిక తత్వవేత్త జ్యోతిరావు పూలే



ఏయూలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ సమత, రిజిస్ట్రార్ స్టీఫెన్, తదితరులు



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న తుల్లి చంద్రశేఖర్ యాదవ్

ఏయూ క్యాంపస్: సామాజిక తత్వవేత్తగా మహాత్మ జ్యోతిరావు పూలే నిలుస్తారని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఉదయం పూలే వర్ధంతి సందర్భంగా ఏయూలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. సమాజంలో అసమానతలు రూపుమాపడానికి, స్త్రీ విద్యకు పూలే చేసిన కృషిని వీసీ వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య పి.అర్జున్, ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, చీఫ్ వార్డెన్ జి.వీర్రాజు, లైబ్రేరియన్ పి.వెంకటేశ్వర్లు, బీసీ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాంబాబు, వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఏయూలోని పూలే విగ్రహానికి వైఎస్సార్‌సీపీ విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాల బీసీ జోనల్ ఇన్‌చార్జి తుల్లి చంద్రశేఖర్ యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఎంవీవీ తదితరులు

సామాజిక ప్రగతిలో పూలే సేవలు చిరస్మరణీయం

ఎంవీపీ కాలనీ: సామాజిక ప్రగతికి మహాత్మ జ్యోతిరావు పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే చిత్ర పటానికి లాసన్స్ బే కాలనీలోని క్యాంపు కార్యాలయంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో జ్యోతిరావు పూలే పాత్ర వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

కిడ్స్ టాలెంట్ షో ఆడిషన్స్‌కు విశేష స్పందన

ఎంవీపీ కాలనీ: చిన్నారుల్లో కళాత్మకతను వెలికితీసి, కళాకారులుగా జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకు వీజేఆర్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ మంగళవారం నిర్వహించిన కిడ్స్ టాలెంట్ షో ఆడిషన్స్‌కు విశేష స్పందన లభించింది. లాసన్స్ బే కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ ఆడిషన్స్‌కు నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 2 నుంచి 14ఏళ్ల లోపు విద్యార్థులు 120 మంది హాజరయ్యారు. మరో 70 మందికి పైగా విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వీజేఆర్ సంస్థ నిర్వాహకురాలు జ్యోతి కొత్తపల్లి మాట్లాడుతూ ఫ్యాషన్, టాలెంట్ షో పేరిట రెండు కార్యక్రమాలు నిర్వహించామని, ఆడిషన్‌లో ఎంపికైన వారు తుది పోటీలో పాల్గొంటారన్నారు. అనంతరం వచ్చే నెలలో ఢిల్లీ వేదికగా జరగనున్న జాతీయ స్థాయి కిడ్స్ ఫ్యాషన్, టాలెంట్ షోలో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి గల వారు వివరాలకు 73861 53282 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.



ఆడిషన్స్‌లో పాల్గొన్న చిన్నారులు

23 ఆటోలపై కేసుల నమోదు

గోపాలపట్నం: స్కూల్ ఆటోలపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. కొమ్మాది, ఎండాడ, ఉప్పాడ ప్రాంతాల్లో మంగళవారం చేపట్టిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 23 ఆటోలు, ఓ స్కూల్ బస్సుపై కేసులు నమోదు చేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు చేపట్టిన తనిఖీల్లో 130 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. అలాగే పలు ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. స్కూల్ ఆటోల్లో అధిక శాతం మంది పిల్లలు ఉంటున్నారని, ఈ విషయంలో పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో ఎంవీఐలు ఐ.వేణుగోపాలరావు, బాలాజీరావు, రాజారావు, శిరీష, శిరీషాదేవి తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ ఆటోను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారి

మర్యాద పూర్వక భేటీ



శామ్యూల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జొనాథన్ మంగళవారం సందర్శించారు. ఆయన రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ నాక్ గ్రేడింగ్‌లో 3.74 స్కోర్ సాధించడంపై పూర్వ విద్యార్థిగా శామ్యూల్ సంతోషం వ్యక్తం చేశారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధిని, విద్యార్థి కేంద్రంగా చేస్తున్న నూతన కార్యకలాపాలను రిజిస్ట్రార్ వివరించారు. ఈ సందర్భంగా శామ్యూల్‌ను రిజిస్ట్రార్ సత్కరించారు.

పేదల ఆకలి తీర్చిన సీఎం వైఎస్ జగన్

- ఇంటి వద్దకే అందుతున్న సంక్షేమ ఫలాలు
- పేదల విద్యపై చంద్రబాబు విషం కక్కుతున్నారు
- ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ



15వ వార్డు సభలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ



9వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ



20వ వార్డు సమావేశంలో పాల్గొన్న మహిళలు



23వ వార్డులో పథకాల పట్టికను ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ



13వ వార్డులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సునీత

ఏయూ క్యాంపస్: పేదల అవసరాలు, ఆకలి గుర్తించి తీర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం 20వ వార్డు చినవాల్తేరు 155 సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును ఎంపీ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గూడు లేని 31 లక్షల మందికి ఇళ్లు కట్టించి ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. రాష్ట్రంలో చిన్నారుల చదువు ప్రభుత్వ బాధ్యతగా స్వీకరించి జగనన్న అమ్మ ఒడి పథకం అమలు చేయడంతో పాటు, ఉచితంగా పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాం, షూలు అందిస్తూ ప్రజలపై భారాన్ని పూర్తిగా తగ్గించిందన్నారు. గతంలో సామాజిక పింఛన్ కోసం ఎన్నో ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి గౌరవంగా పెన్షన్ అందిస్తున్నారని గుర్తు చేశారు. గతంలో కేవలం రూ. 750 పెన్షన్ అందించేవారని, నేడు రూ.2750 పెన్షన్ అందుతోందన్నారు.

చంద్రబాబు ఆకలి తీర్చుకుంటాడు..

మాజీ సీఎం చంద్రబాబు ఎప్పుడూ తన ఆకలి, తన కొడుకు లోకేష్ ఆకలి మాత్రమే తీర్చుకోవాలని చూస్తారని, ప్రజలను పట్టించుకోరని ఎంపీ ఎంవీవీ విమర్శించారు. పేద పిల్లలకు నాణ్యమైన ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందించడంపై ప్రతిపక్షాలు విషం కక్కుతున్నారన్నారు. లోకేష్ తన కుమారుడిని మాత్రం ప్రభుత్వ బడిలో చేర్చకుండా, ఆంగ్ల మాధ్యమంలో ఎందుకు చదివిస్తున్నారని ప్రశ్నించారు. ఇందుకు చంద్రబాబుకు పవన్ కల్యాణ్ వంతపాడుతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోని వస్తే ప్రజా సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని స్వయంగా పవన్ కల్యాన్ చెప్పడం వారికి ప్రజల సంక్షేమంపై ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టమవుతోందన్నారు. 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్‌చంద్ర, 21వ వార్డు ఇన్‌చార్జి మధుపాడ రవికుమార్, మార్కెటింగ్ వైస్ చైర్మన్ యువత రెడ్డి, కన్వీనర్లు, పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి మళ్లీ జగన్ అవసరం

ఆరిలోవ: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ప్రజలకు అవసరమని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 9, 13 వార్డుల్లో మంగళవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలు జరిగాయి. 9వ వార్డులో పార్టీ జెండాతో పాటు సంక్షేమ పథకాల బోర్డును ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ స్వాతి, నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీనివాసరావు, అప్పారావు, కళావతి, భీమారావు, పిట్టారెడ్డి, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

- ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత స్థానిక నాయకులతో కలసి పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, వెంకటరెడ్డి, దుర్గారావు, అప్పలనాయుడు, పద్మ, కొండమ్మ, భవాని పాల్గొన్నారు.

పేదల ఆర్థిక ప్రగతే లక్ష్యం

మద్దిలపాలెం: పేదల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ ప్రజల హృదయాల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలు మంగళవారం 23వ వార్డు మద్దిలపాలెంలో కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి ఆధ్వర్యంలో, 15వ వార్డులో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా పార్టీ జెండాలు, సంక్షేమ పథకాల బోర్డులను ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ప్రస్తుత సర్కారుకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్ పాల్గొన్నారు.

వర్సిటీ వనరులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ భౌతికశాస్త్ర విభాగంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విభాగంలో, విశ్వవిద్యాలయంలో ఉన్న వసతులు, వనరులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ తమ లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. భౌతిక శాస్త్రంలో పరిశోధనలు చేసే దిశగా ఆసక్తి చూపాలన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో అర్హత సాధించే విధంగా సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల వేలం నేడు

మద్రిపాలెం: పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన నాలుగు చక్రాల వాహనాలను వేలం వేయనున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) గోపాలపట్నం సర్కిల్–4 సీఐ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ ఎన్ఆర్ ఫంక్షన్ హాలు పక్కన ఉన్న గోపాలపట్నం సర్కిల్–4 కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు.